క్లుప్తంగా

చండీయాగం ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరిదేవి ఆలయం

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి దీక్ష విరమణ సందర్భంగా మంగళవారం చండీ యాగం ప్రారంభమైంది. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలోని యాగశాలలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ నెల 26వ తేదీ పూర్ణాహుతితో చండీయాగం ముగుస్తుందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ పీవీకుమార్‌రెడ్డి, పీఆర్ మురళిరెడ్డి, పీవీ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

శ్మశాన వాటిక రహదారి పనులు ప్రారంభం



జేసీబీలతో జరుగుతున్న పనులు

కొలిమిగుండ్ల: స్థానిక ప్రధాన రహదారిలోని బ్రిడ్జి కింద భాగంలో ఉన్న శ్మశాన వాటిక పనులు ప్రారంభమయ్యాయి. మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రెండు జేసీబీలు ఏర్పాటు చేసి శ్మశాన వాటిక రహదారిలో ఉన్న చెత్తచెదారం, కంపచెట్లను తొలగించి పూర్తిగా శుభ్రం చేశారు. దారిలో కొత్తగా గ్రావెల్ ఏర్పాటు చేయనున్నట్లు సర్పంచ్ శివరాముడు తెలిపారు. వాగు మధ్య భాగంలో నుంచి శ్మశానం వరకు కల్వర్టు నిర్మాణం కోసం అధికారులు నివేదికలు తయారు చేశారు. వాగులో పెద్ద ఎత్తున చెత్త చెదారం పేరుకుపోయి మురుగునీరు నిల్వ చేరాయి. జేసీబీతో మురుగునీరు ప్రవహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పనులను ఈఓఆర్డీ శివ ప్రసాద్ పరిశీలించారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ



దుస్తులు అందజేస్తున్న కమిషనర్, చైర్మన్

బేతంచెర్ల: నగర పంచాయతీ పరిధిలో పనిచేసే పారిశుద్ధ్య, వాటర్‌మెన్స్‌కు కమిషనర్ హరి ప్రసాద్, చైర్మన్ చలం రెడ్డి, వార్డు కౌన్సిలర్ల చేతుల మీదుగా మంగళవారం దుస్తులు, కాస్మోటిక్ వస్తువులను అందజేశారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో నగర పంచాయతీ సిబ్బంది సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.

రమీజ్ మృతికి నివాళి

డోన్: మండలంలోని యు కొత్తపల్లె గ్రామానికి చెందిన రమీజ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం సంతాపం వ్యక్తం చేశారు. మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మల్లెంపల్లె రామచంద్రుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్ హుసేన్, సోమేష్ యాదవ్, హరి, పోస్టుప సాద్, చిరంజీవి తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు.

రేపటి నుంచి కందుల కొనుగోలు

డోన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో గురువారం నుంచి కందుల కొనుగోలు ప్రారంభిస్తున్నట్లు కమిటీ పర్సన్ ఇన్‌చార్జ్ అబ్దుల్ రహిమాన్, కార్యదర్శి మాధవక్రిష్ణారెడ్డి తెలిపారు. డోన్ వ్యవసాయ సబ్ డివిజన్‌లో కంది పంటను సాగుచేసిన రైతులు గిట్టుబాటు ధర పొందేందుకు మార్కెట్ అనువుగా ఉంటుందన్నారు. టెండర్ పద్ధతి ద్వారా అమ్మకాలు జరుపుతున్నందున రైతులకు మంచి గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉందని తెలిపారు. కందులు అమ్మకం జరిగిన రోజునే నగదు చెల్లింపు ఉంటుందని చెప్పారు. రైతులు తెచ్చే కందుల్లో రాళ్లు, పుల్లలు లేకుండా చూసుకోవాలని సూచించారు.

రోడ్డుభద్రత నియమాలపై అవగాహన

కోవెలకుంట్ల: రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని సీవీ రామన్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు.



కోవెలకుంట్ల: విద్యుద్దీపాలంకరణలో సీఎస్ఐ చర్చి.



ఏసుక్రీస్తు జననాన్ని తెలిపేలా ఏర్పాటు చేసిన పశువుల పాక,



బనగానపల్లె: విద్యుత్‌దీపాలంకరణంలో సీఎస్ఐ టౌన్ చర్చి

క్రిస్మస్ సందడి

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలో క్రిస్మస్ వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లో చర్చిలను విద్యుత్‌దీపాలతో సుందరంగా అలంకరించారు. ఏసుక్రీస్తు పుట్టిన రోజు సందర్భంగా క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేసి బాలఏసు, మరియమ్మ ప్రతిమలను ప్రతిష్ఠించారు. కోవెలకుంట్ల–నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో వెలసిన రోమన్‌కాథలిక్ మిషన్ చర్చి(ఆర్‌సీఎం), చర్చిఆఫ్ సౌత్ ఇండియన్(సీఎస్ఐ) చర్చి, హోసన్న, నూతన యేరుసలేం చర్చిలతో పాటు మండలంలోని గుళ్లదుర్తి, కంపమల్ల, భీమునిపాడు, కలుగొట్ల, రేవనూరు, బిజనవేముల, అమడాల, సౌదరదిన్నె చర్చిల్లో మంగళవారం అర్ధ రాత్రి 2 గంటల నుంచి ప్రార్థనలు ప్రారంభమయ్యాయి.

- **బనగానపల్లెరూరల్:** మండలంలో మంగళవారం రాత్రి నుంచే చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి.



బనగానపల్లె: విద్యుత్‌దీపాలంకరణలో మదర్‌థెరిస్సా చర్చి

బనగానపల్లె సీఎస్ఐ టౌన్ చర్చిలో ఫాదర్ రెవరెండ్ దైవదినం, బేతంచర్ల రోడ్డులోని మదర్‌థెరిసా చర్చిలో బాబురాజ్, పెండేకంటి నగర్‌లోని పెంతేకోస్తు, నంద్యాల రోడ్డులోని హోసన్న మందిరం, ఏసుకృపా మందిరాల్లో కేక్ కటింగ్ చేశారు. ఏసుక్రీస్తు జననాన్ని గుర్తు చేసేలా పశువుల పాక, క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేశారు.



ఆర్‌సీఎం చర్చిలో ఏర్పాటు చేసిన పశువుల పాక



బేతంచెర్లలో..

- **బేతంచెర్ల:** పట్టణంలోని సీఎస్ఐ, ఆర్‌సీఎం, హోసన్నా, లెమెన్స్ ఇవాంజలికల్, ఆర్ఎస్ రంగాపురం, సిమెంట్‌నగర్ గ్రామాల్లోని ప్రార్థన మందిరాలను అలంకరించారు. ఆయా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

సామాన్యులపై బాదుడే..బాదుడు



వైఎస్సార్‌సీపీ పోరుబాట పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, పార్టీ నాయకులు

- ఆరు నెలల్లోనే రెండు సార్లు విద్యుత్ చార్జీల వడ్డన
- ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం
- విద్యుత్ చార్జీల పెంపుపై 27న పోరుబాట
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచం.. అవసరమైతే తగ్గిస్తామంటూ ఎన్నికల ముందు ఊరూరా ప్రచారం చేసిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు విద్యుత్ చార్జీలు తగ్గించకపోగా ఆరు నెలల్లోనే రెండుసార్లు చార్జీలు పెంచి ప్రజలకుపై రూ.15.450 కోట్ల భారం మోపారని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తన స్వగృహంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు కష్టాలు మొదలయ్యాయని తెలిపారు. వచ్చీరాగానే విద్యుత్ చార్జీల భారం మోపిందన్నారు. రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచి సామాన్యుల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. సూపర్‌సిక్స్ అంటూ హడావుడి చేసిన ఆ పార్టీ నాయకులు ఆ తర్వాత మిన్నకుండిపోయారని ఎద్దేవా చేశారు. హామీలను విస్మరించి ప్రజలపై పన్నులు, చార్జీల భారం మోపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ తీరుతో ప్రజలతో పాటు కుటీర, మధ్య తరహా పరిశ్రమలు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు ఈనెల 27న విద్యుత్‌చార్జీల పెంపుపై ఆందోళనలు చేయనున్నట్లు తెలిపారు. పోస్టర్లను ఆవిష్కరించారు.

ప్రజల గొంతు వినిపించేందుకే..

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు ఒకమాట ఎన్నికల తరువాత మరోమాట మాట్లాడుతున్నారని, సామాన్యుల గొంతును వినిపించేందుకే వైఎస్సార్‌సీపీ ఉద్యమ బాట పడుతున్నట్లు తెలిపారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చామని.. కూటమి ప్రభుత్వం బిల్లులు చెల్లించాలని ఒత్తిడి చేస్తోందన్నారు. ఈ నెల 27న జరిగే నిరసన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, నాయకులు అబ్దుల్‌ఫైజ్, అత్తార్ జాహెద్, సత్యంరెడ్డి, మౌలి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

డోన్ టౌన్: వినియోగదారుల చట్టాలపై విస్తృత అవగాహన అవసరమని ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జ్యోతి అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో మంగళవారం జాతీయ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ.. వినియోగదారులకు రక్షణ చట్టాలు ఉన్నాయని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన వస్తువు సేవలో లోపం కనిపిస్తే బిల్లు ద్వారా వినియోగదారుల ఫోరంను ఆశ్రయించాలని సూచించారు. వ్యాపారులు కూడా వినియోగదారుడే సంస్థ అభివృద్ధికి మూలం అనే విషయాన్ని విస్మరించరాదన్నారు. హక్కులు, చట్టాలపై స్వచ్ఛంద సంస్థలు కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం వినియోగదారులను చైతన్యపరిచే కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్, న్యాయవాదులు రాగుల రాముడు, నారాయణ, శివరామకృష్ణ, మద్దిలేటి, రవి, కుమారి, సమగ్ర వినియోగదారుల సంక్షేమ సంస్థ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సామాజిక కార్యకర్త మహ్మద్ రఫీ పాల్గొన్నారు.



కర పత్రాలను విడుదల చేస్తున్న జడ్జి

అందరూ సుఖశాంతులతో జీవించాలి

బేతంచెర్ల: ఏసు దీవెనలతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆకాంక్షించారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని డోన్ నియోజకవర్గ ప్రజలకు మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ శాంతి, ప్రేమ, దయాగుణం కలిగి తోటి వారితో మంచిగా మెలగాలన్నారు.

కొచ్చెర్వు దేవరకు ముమ్మర ఏర్పాట్లు



గ్రామంలో దున్నపోతుల ఊరేగింపు

డోన్: మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి మొదలయ్యే గ్రామ దేవర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రాకేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవరకు వచ్చే వివిధ గ్రామాల ప్రజలు, బంధువర్గాన్ని దృష్టిలో ఉంచుకుని కొచ్చెర్వు అడ్డరోడ్డు నుంచి వచ్చే వాహనాలను హైస్కూల్ వద్ద, డోన్ నుంచి వచ్చే వాహనాలను గ్రామ సచివాలయం వెనుక నిలుపుకునేందుకు పార్కింగ్ స్థలాలను కేటాయించారు. దేవర సందర్భంగా గ్రామంలో నాటుసారా, మద్యం విక్రయాలు జరపకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా, రెండు రోజుల నుంచి దేవరకు సంబంధించిన కార్యక్రమాలను గ్రామస్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. దున్నపోతులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ వీధుల మీదుగా తిప్పుతున్నారు.

సంపద సృష్టి అంటే పన్నుల భారం మోపడమా?

- విద్యుత్ చార్జీల పెంపుపై 27న పోరుబాట
- మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు

డోన్: అబద్ధపు హామీలను ఆకర్షణీయంగా చెప్పి రాష్ట్ర ప్రజలను ముంచిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, పార్టీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్ అన్నారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో వారు మాట్లాడుతూ.. పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా ఈనెల 27వ తేదీ డోన్‌లో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని తెలిపారు.

సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయి?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఆరు నెలల్లోనే విద్యుత్ చార్జీలు, ఇంటి పన్నులు, రిజిస్ట్రేషన్ చార్జీలు భారీగా పెంచి సామాన్యులపై భారం మోపిందని మండిపడ్డారు. రూ.15వేల కోట్లు అప్పు చేసి ప్రజల నెత్తిన పెనుభారం మోపిందన్నారు. సంపద సృష్టి అంటే ప్రతి వీధిలో వైన్‌షాపులు పెట్టడం, పన్నులు వేసి పేదల నడ్డి విరచడమా అని నిలదీశారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు తగ్గించాలని బషీర్‌బాగ్‌లో ఆందోళన చేస్తున్న వారిని కాల్చిచంపిన రక్తచరిత్ర టీడీపీదని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి పనులను గాలికి వదిలేసి విపక్ష పార్టీ నేతలపై తప్పుడు కేసులు బనాయిస్తూ వేధిస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు. విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ ఈ నెల 27న జరిగే ఆందోళన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తరలిరావాలని కోరారు. పార్టీ నాయకులు దొరపల్లె చిరంజీవి, కురుకుందు హరి, సోమేష్ యాదవ్, పాతపేట రఫీ, కుమ్మరి రాజు, మల్యాల శ్రీనివాసరెడ్డి, మేకల రాజు, జనార్ధన్, వెంకటేష్, కాలేషా, మిట్టా రవి, రఘు, సతీష్, నాగిరెడ్డి, ఆదాం, క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోరుబాట పోస్టర్లను విడుదల చేస్తున్న శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు

8 నుంచి ముక్కోటి ఏకాదశి బ్రహ్మోత్సవాలు

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో జనవరి 8 నుంచి 11వ తేదీ వరకు ముక్కోటి ఏకాదశి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని.. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని డోన్ ఆర్డీఓ నరసింహులు అధికారులకు సూచించారు. మంగళవారం ఆలయ ఆవరణలో ఉప కమిషనర్ రామాంజనేయులు, సీఐ వెంకటేశ్వరరావుతో ఉత్సవాల నిర్వహణపై సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కోనేరు, నీటి గుండం చుట్టూ గజ ఈతగాళ్లను ఉంచాలని, విద్యుత్ ప్రమాదాల నివారణకు ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద వలంటీర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం రంగాపురం నుంచి ఆలయానికి ఉచిత ఆటో సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీటీ మారుతి, అగ్నిమాపక ఎస్ఐ రంగస్వామిగౌడు, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహిళలకు ఉద్యోగ అవకాశాలు

డోన్ టౌన్: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీసిటీలోని ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా కంపెనీలో మహిళలకు ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు డోన్ కేంద్రం అధికారి తిమోతి తెలిపారు. బీఎస్సీ మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, స్టాటిస్టిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ కంప్యూటర్స్, డిప్లమో మెకానికల్, ఈసీఈ, ఈఈఈ కోర్సుల్లో 2021–2024 మధ్య పాస్ అయిన అభ్యర్థులు అర్హులన్నారు. 19 నుంచి 26 ఏళ్ల లోపు ఉండాలన్నారు. ఎంపికైన వారికి రూ.19 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వివరాలకు 9154449677, 9908243736 నంబర్లను సంప్రదించాలన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

కొలిమిగుండ్ల: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని బెలుం సీఎస్ఐ చర్చి సంఘ పెద్దల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను చర్చి ఆవరణలో ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 30కి పైగా కబడ్డీ జట్లు హాజరయ్యాయి. స్నేహపూర్వక వాతావరణంలో ఆటలు ఆడాలని సంఘ పెద్దలు సూచించారు. క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

రేపు సీపీఐ శతజయంతి వేడుకలు

బనగానపల్లె రూరల్: మండలంలో గురువారం నిర్వహించనున్న సీపీఐ శతజయంతిని విజయవంతం చేయాలని ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి శివయ్య, సీపీఐ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి కోరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో సీపీఐ ఆవిర్భవించిందని తెలిపారు. అప్పటి నుంచి కార్మికులు, రైతులు, ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తోందన్నారు.

వార్డుల్లో టీడీపీ నాయకుల పెత్తనాన్ని సహించం



సమస్యలను విన్నవిస్తున్న నగర పంచాయతీ వైస్ చైర్మన్ పర్వీన్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ హరి ప్రసాద్

- అధికారులు అధికార పార్టీకి వత్తాసు పలకడం సరికాదు
- వార్డు కౌన్సిల్ తీర్మాణం లేకుండా వాటర్ ప్లాంట్ ఏర్పాటుపై కౌన్సిలర్ల అభ్యంతరం
- వాడివేడిగా సర్వసభ్య సమావేశం

బేతంచెర్ల: ప్రజల చేత ఎన్నికైన వార్డు సభ్యులను కాదని అధికారులు టీడీపీ నాయకులు చెప్పింది చేస్తూ వారికి వత్తాసు పలకడం సరికాదని నగర పంచాయతీ వైస్ చైర్మన్లు నాగ వెంకటేశ్వర్లు, పర్వీన్, వార్డు కౌన్సిలర్లు ఇబ్రహీం, షేక్ ముబీనా, మధు, కోట్ల మధు, నాగజ్యోతి, శకుంతల అన్నారు. మంగళవారం బేతంచెర్ల నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ చలంరెడ్డి అధ్యక్షతన వార్డు కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 21వ తేదీ బైటిపేటలో వార్డు కౌన్సిల్ తీర్మాణం లేకుండా, కాలనీ ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా టీడీపీ నాయకుడి ఒత్తిడితో అధికారులు మినరల్ వాటర్ ప్లాంట్‌కు కాలనీవాసులు వాడుకునే బోరుబావి నుంచి పైప్‌లైన్ ఏర్పాటుకు పూనుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

రైతులు, పశువుల దాహం తీర్చడానికి ఉన్న బోరుబావిని మినరల్ వాటర్ ప్లాంట్‌కు మళ్లించకుండా కాలనీలో ఉన్న మరో బోరు నుంచి తీసుకోవాలని విన్నవిస్తున్నా పట్టించుకోకుండా ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు పూనుకోవడం మంచి పద్ధతేనా అని నిలదీశారు. హనుమాన్ నగర్ కాలనీలో గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ నుంచి 6 నెలలుగా టీడీపీ నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తన వార్డు పరిధిలో ఏడు నెలల క్రితం రూ.1.65 కోట్లతో సీసీ రోడ్లు, కల్వర్టులు, కాల్వలకు భూమి పూజ నిర్వహించినా ఇంత వరకు నిర్మాణాలు చేపట్టకపోవడంతో కాలనీవాసులకు సమాధానం చెప్పుకోలేకపోతున్నానని కౌన్సిలర్ షేక్ ముబీనా అన్నారు. కొత్త బస్టాండు పరిధిలో మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి నీరు రావడం వల్ల బేతంచెర్లకు తాగునీటి సమస్య తీరిందని, నిధుల జాప్యం కారణంగా అభివృద్ధి పనులు ఆలస్యం అవుతున్నాయని, రానున్న రోజుల్లో సమష్టిగా ప్రజల సమస్యల పరిష్కారంతోపాటు అభివృద్ధి పనులకు కృషి చేద్దామని చైర్మన్ చలంరెడ్డి తెలిపారు.

5 నెలలుగా నగర పంచాయతీ పారిశుద్ధ్య, వాటర్‌మెన్స్‌కు జీతాలు రాలేదని కోఆప్షన్ సభ్యుడు ఎల్లయ్య కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. చర్యలు తీసుకుంటామని చైర్మన్, కమిషనర్ తెలిపారు. హనుమాన్ నగర్‌లోని మినరల్ వాటర్ ప్లాంట్‌ను నగర పంచాయతీ పరిధిలోకి తీసుకొస్తామని, వార్డుల్లో జరిగే అభివృద్ధి పనులపై సభ్యులకు సమాచారం ఇస్తామని కమిషనర్ హరిప్రసాద్ సమాధానం ఇచ్చారు.

పంట మార్పిడితో అనేక ప్రయోజనాలు

కొలిమిగుండ్ల: పంట మార్పిడి పద్ధతులు పాటించడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం కమ్మవారిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేసిన పంటల పరిస్థితుల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శనగ, జొన్న, కంది పంటల సాగులో మెలకువలు పాటించాలని పేర్కొన్నారు. శనగ పంట వేసే పొలంలో ముందుగా ఖరీఫ్‌లో కొర్ర, మినుము, సోయా పంటలను వేసుకోవడం ద్వారా వ్యవసాయం మరింత లాభసాటిగా మార్చుకోవచ్చని సూచించారు. మెట్ట భూముల్లో వర్షాధారం కింద రెండు పంటలు పండించుకోవాలని చెప్పారు. బీమా, ఈ–క్రాప్ బుకింగ్, ఎన్‌పీఎస్ఎస్‌పై సిబ్బందితో చర్చించారు. కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్, వ్యవసాయాధికారి జ్యోతి, ఏఈఓలు నాగరాజు, వనిత పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

శనగలో యాజమాన్య పద్ధతులు



రైతులకు సూచనలిస్తున్న ఏఓ నిరంజన్

కోవెలకుంట్ల: ఈ ఏడాది రబీ సీజన్‌లో విస్తారంగా సాగు చేసిన పప్పుశనగ పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. మంగళవారం మండలంలోని కలుగొట్లలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం శనగ పైరును వేరుకుళ్లు, మొదలుకుళ్లు తెగుళ్లు ఆశించి అక్కడక్కడా మొక్కలు చనిపోతున్నాయన్నారు. ఇటీవల తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాల కారణంగానే తెగుళ్లు సోకాయన్నారు. నివారణ చర్యగా పురుగు మందులతోపాటు సాఫ్‌పౌడర్, హెక్సకోనజోల్ మందులను కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తెగులు సోకిన మొక్కలను పీకి వేసి ఆ ప్రదేశంలో సాఫ్ పౌడర్ కలిపిన నీళ్లను భూమిలో పోయడం వల్ల తెగుళ్ల వ్యాప్తిని తగ్గించవచ్చని తెలిపారు. అలాగే శనగ పైరులో సూక్ష్మ పోషకాల లోపం వల్ల ఆకులు తెలుపుగామారి ఎండిపోవడాన్ని గుర్తించామన్నారు. నివారణకు 19:19:19 లేదా 13:0:45 రసాయన ఎరువులను నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ విశ్వనాథ్

సంజామల: భూసమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంభూపాల్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గిద్దలూరులో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అర్జీలను ఎప్పటికప్పుడు విచారించి పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. తహసీల్దార్ అనిల్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ తులసీకృష్ణ ఉన్నారు.